సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం | 22 | జూలై | 2025



తెలంగాణ ఉద్యమ దివిటీ దాశరథి - 8లో▸
నైజాం రాజులను ఎదురించిన తెలంగాణ ఉద్యమ దివిటీ దాశరథి కృష్ణమాచార్యులు. నేడు దాశరథి జయంతి.



ఆర్థిక ఇబ్బంది ఉన్నా.. అభివృద్ధే లక్ష్యం - 8లో▸
ప్రభుత్వం ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూనే మరో వైపు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి పొంగులేటి అన్నారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం $30^0/23^0$
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఉరుములు మెరుపులతో వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

పింగిళిలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

విద్యారణ్యపురి: హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 2025 - 2026వ విద్యా సంవత్సరానికి వివిధ సబ్జెక్టులలో విద్యాబోధనకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బయో టెక్నాలజీలో -1, స్టాటిస్టిక్స్ 1, అప్లైడ్ న్యూట్రిషన్ 1, బీసీఏ 1, కంప్యూటర్ అండ్ అప్లికేషన్స్ 2, డేటాసైన్స్ 1, ఇంగ్లిష్ 1, మ్యాథమెటిక్స్ 1, బీబీఏ రిటైల్ 1, మైక్రో బయాలజీలో (1) ఖాళీలకు ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 23 సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో తమ బయోడేటాతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 24న ఉదయం ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్, సెట్‌తో పాటు అనుభవం, అర్హతలను బట్టి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

కాకతీయ డిగ్రీ కళాశాలలో..


విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 - 2026వ విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) -3, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ రిటైల్ ఆపరేషన్స్ 1, బీసీఏ 1, బిజినెస్ అనలిటిక్స్ 1, కంప్యూటర్ సైన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ 3, క్రాప్ ప్రొడక్షన్ 1, డేటా సైన్స్ 1, ఎలక్ట్రానిక్స్ 1, ఫిషరీస్ 1, మైక్రో బయాలజీ 1, స్టాటిస్టిక్స్ (1) కోర్సుల విద్యాబోధనకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 24న సాయంత్రం 4గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం వైస్ ప్రిన్సిపాల్ రజనీలతను సంప్రదించాలని సూచించారు.

30న జిల్లా స్థాయి జూడో పోటీలు



రామన్నపేట: నగరంలోని కెమిస్ట్ భవన్‌లో ఈ నెల 30న సబ్ జూనియర్స్, కేడెట్ విభాగాల్లో బాల బాలికలకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూడో పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు బైరబోయిన కైలాష్ యాదవ్ తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ జూనియర్ విభాగంలో పాల్గొనే బాల బాలికలు విభాగాల వారీగా 2011 - 2013వ సంవత్సరాల్లో జన్మించి ఉండాలని, బాలురు 30 - 66 కిలోలలోపు, బాలికలు 28 - 57 కిలోల బరువు ఉండాలని పేర్కొన్నారు. కేడెట్ విభాగంలో పాల్గొనే బాల బాలికలు విభాగాల వారీగా 2008 - 2010వ సంవత్సరాల్లో జన్మించి ఉండాలని, బాలురు 50 - 90 కిలోల లోపు, బాలికలు 40 - 90 కిలోలలోపు ఉండాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్ వెంట తీసుకొని రావాలని కోరారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 5, 6వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 99899 53253 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



వరంగల్ స్పోర్ట్స్: ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు గద్వాలలో జరగనున్న 10వ జూనియర్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు వరంగల్ జిల్లా బాలుర జట్టు ఎంపిక పూర్తైనట్లు వరంగల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పృథ్వీశ్వర్ రెడ్డి, రమేష్ తెలిపారు. ఈ నెల 6వ తేదీన హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో జిల్లా స్థాయి ఎంపికను నిర్వహించగా, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు వివరించారు.

25నుంచి పలు రైళ్లు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పెద్దపల్లి బైపాస్ లైన్ వర్క్స్, బల్లార్షా - కాజీపేట సెక్షన్‌లో రైల్వే బ్లాక్‌తో ఈనెల 25వ తేదీ నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. కాజీపేట మీదుగా బల్లార్షా, వరంగల్ మీదుగా కరీంనగర్ నుంచి కాగజ్‌నగర్ వరకు ప్రయాణించే పలు ప్యాసింజర్ రైళ్లను కాజీపేట వరకు మాత్రమే నడిపించనున్నట్లు రైల్వే అధికారులు వివరించారు.

అవినీతికి ఆసరా!

బల్దియాలో పింఛన్ పొందుతున్న అనర్హులు 3వేల మంది?

- ఇటీవల తనిఖీల్లో వెలుగులోకి.. బయటికి పొక్కనీయని అధికారులు
- సోషల్ ఆడిట్ లేక ఇష్టారాజ్యం
- ఇతోధికంగా సహకరిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది



వరంగల్ అర్బన్: ఆదరణ కోల్పోయిన వారికి అండగా ఉండాలనే ప్రభుత్వ ఆశయం పక్కదోవ పడుతోంది. ఆసరా పింఛన్లు కొందరు అవినీతి అధికారుల జేబులు నింపడానికి ఆసరాగా మారుతున్నాయి. ఏదైనా కారణంతో లబ్ధిదారుడు మృతిచెందితే వెంటనే ప్రభుత్వానికి నివేదించాలన్న బాధ్యత కొందరు కుటుంబ సభ్యుల్లో లోపిస్తోంది. దీనికితోడు అనర్హులు, అక్రమార్కులు కూడా ఒకే ఇంటినుంచి నలుగురు వరకు పింఛన్లు పొందుతున్నారు. ఎప్పటికప్పుడు సోషల్ ఆడిట్ చేసి ఉన్నతాధికారులకు వివరాలు అందించాల్సిన సిబ్బంది మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవట్లేదన్న ఆరోపణలున్నాయి. ఇదే తరుణంలో అర్హత ఉండి పింఛన్ పొందలేకపోతున్న నిస్సహాయులు అనేక మంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పింఛన్ల అవకతవకలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తేనే పథకం ఆశయం నెరవేరుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చనిపోయినా.. బ్యాంకు ఖాతాల్లో జమ
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 76,379మంది ఆసరా పింఛన్‌దారులు ఉన్నారు. కొంతమంది లబ్ధిదారులు చనిపోయినప్పటికీ వారి ఖాతాల్లో సొమ్ము జమవుతూనే ఉంది. వారిలో కొందరు కుటుంబ సభ్యులు ఏటీఎం కార్డుల ద్వారా నగదు డ్రా చేస్తున్నారు. మరికొంతమంది మృతుల ఖాతాల్లో ఏళ్ల తరబడి పింఛన్ల సొమ్ము బ్యాంకుల్లోనే మూలుగుతోంది. భర్త లేదా భార్య వారి స్థానంలో మరొకరి కొత్తగా పింఛన్ కావాలంటే మృతిచెందిన ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికెట్) సమర్పించాలి. ఆ తేదీనుంచి బ్యాంక్‌లో జమ అయినా సొమ్ము తిరిగి బల్దియా ట్రెజరీలో జమ చేస్తేనే దరఖాస్తు స్వీకరించి, విచారణ చేసి, కొత్త పింఛన్ కోసం ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. ఒక్కరే ఉండి, ఇక పింఛన్‌కు ఆస్కారం లేకపోతే ఆ సొమ్ము పక్కదారి పడుతోంది. బల్దియా వ్యాప్తంగా సుమారు 3వేల మంది వరకు అనర్హులు ఉన్నట్లు ఇటీవల జరిగిన తనిఖీల్లో వెలుగు చూసింది. కానీ ఈ విషయాన్ని అధికారులు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనర్హులకు పింఛన్లు..
ఆధారం లేని వృద్ధులు, వితంతువులు, బీడీ, చేనేత, గీత కార్మికులకు అందుతున్న పింఛన్లలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఒకే ఇంటినంబర్‌పై ఇద్దరు నుంచి నలుగురు బీడీ కార్మికుల పేరిట సర్కారు సొమ్ము దోపిడీ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పింఛన్లను అర్హులకు ఇవ్వాలని, ఇప్పటికే ఉన్న పింఛన్‌దారుల వివరాలను కట్టుదిట్టంగా పరిశీలించి అనర్హులను ఏరివేయాలని ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు ఆదేశిస్తోంది. కానీ జిల్లా అధికారుల పర్యవేక్షణాలోపం, క్షేత్రస్థాయిలో సిబ్బంది విచారణ పేరిట ఎంతో కొంత తీసుకొని వదిలేస్తుండటంతో కోట్లాది రూపాయల సొమ్ము దుర్వినియోగమవుతోంది.

పింఛన్ కోసం 16వేల మంది నిరీక్షణ
బల్దియాలో మూడున్నరేళ్లుగా సుమారు 16వేల మంది కొత్త పింఛన్ కోసం నిరీక్షిస్తున్నారు. దరఖాస్తు పెట్టుకొని, విచారణ పూర్తయి ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండడంతో ఎప్పుడు పింఛన్ మంజూరు చేస్తారో తెలియక ఆందోళన చెందుతున్నారు. అధికారులను అడిగితే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని దాటవేస్తున్నారు. దీంతో అర్హులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు.

తిరిగి రాబడుతున్నాం..
మృతుల పేరిట ఖాతాల్లో పింఛన్ల నగదు జమ అవుతుందనే విషయం మా దృష్టికి వచ్చింది. పింఛన్ల సొమ్ము పేరుకుపోతే వెంటనే సమాచారం ఇవ్వాలని బ్యాంకర్లకు లేఖలు రాశాం. అనర్హులు ఉంటే ప్రత్యేకంగా సర్వే చేయిస్తాం.
– జోనా, బల్దియా అడిషనల్ కమిషనర్

గ్రేటర్ పరిధిలో పింఛన్‌దారులు	దివ్యాంగులు	బీడీ కార్మికులు	ఒంటరి మహిళలు	వృద్ధులు	గీత కార్మికులు	చేనేత కార్మికులు	వితంతువులు
	8,836	5,989	2,351	24,668	623	1,913	31,999

ఆగస్టు 10వరకు రేషన్ కార్డుల పంపిణీ

కలెక్టర్ల వీసీలో సీఎం రేవంత్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: ఈ నెల 25 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని సీఎంఓ కార్యాలయం నుంచి వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్‌కార్డుల పంపిణీ వంటి పలు అంశాలపై మంత్రులు ఉత్తమ్ కుమార్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, సీతక్క, శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సాగు పనులు సజావుగా సాగేందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారద, హనుమకొండ, వరంగల్ అదనపు కలెక్టర్లు వెంకటరెడ్డి, సంధ్యారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీఎంహెచ్‌ఓలు అప్పయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.



వీసీలో కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అధికారులు

యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి

నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌లో తలెత్తిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. ఫిల్టర్‌బెడ్ పరిధిలో తాగునీటి సరఫరా నిలిచిపోయిందనే సమాచారంతో సోమవారం రాత్రి ఆకస్మికంగా మేయర్ తనిఖీ చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై అధికారులపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. బల్దియా ద్వారా రెండు 500కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీల్లో ఇన్‌చార్జ్ ఎస్ఈ మహేందర్, డీఈ కార్తీక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్
వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్ ప్రాంతంలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు కొనసాగుతున్నందున పలు ప్రాంతాలకు మంగళవారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాజీపేట దర్గా, కాజీపేట, ప్రశాంత్ నగర్, సుబేదారి ఎఫ్‌సీఐ కాలనీ, ప్రకాశ్‌రెడ్డి పేట, వడ్డేపల్లి ఎన్జీవోస్ కాలనీ, టీవీ టవర్‌కాలనీ, గోపాల్‌పూర్, జవహర్ నగర్ కాలనీ, శాయంపేట అడ్వకేట్ కాలనీ, శ్రీనివాస కాలనీ, హంటర్ రోడ్డు, టీచర్స్ కాలనీ, కనకదుర్గ కాలనీ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

నగరంలో చైన్ స్నాచింగ్

హసన్‌పర్తి: నగరంలోని యాదవనగర్ ప్రాంతంలోని ఎస్సారెస్పీ కట్ట వద్ద చైన్ స్నాచింగ్ జరిగింది. ఈ ఘటనలో సుమారు రెండు తులాల గొలుసు అపహరణకు గురైంది. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రెండో డివిజన్ భగత్‌సింగ్ నగర్‌కాలనీకి చెందిన లింగం కోమల వ్యక్తిగత పనుల నిమిత్తం ఎస్సారెస్పీ కట్టపై నుంచి సోమవారం ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ఓ గుర్తు తెలియని యువకుడు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ప్రజా ప్రభుత్వ పాలనలో
అభివృద్ధి పరుగులు

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ నగర్‌లో ఆహార భద్రత (రేషన్) కార్డుల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పడకేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఇచ్చిన మాట మేరకు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కార్డులు ఇవ్వగా, ఇప్పుడు తిరిగి తమ ప్రభుత్వ హయాంలోనే కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,469 కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ రమేష్ రాథోడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, రవీందర్ యాదవ్, వేముల శ్రీనివాస్, విజయశ్రీ రజాలీ, మానస, పోతుల శ్రీమాన్, మామిండ్ల రాజు, చీకటి శారద, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, గాండ్ల స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.




లబ్ధిదారుకు రేషన్‌కార్డు మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, చిత్రంలో మేయర్ గుండు సుధారాణి

డబుల్ బెడ్రూం ఇళ్లు పంచుడే..
హనుమకొండ బాలసముద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు పంచనున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని అనుకున్నామని, సెలవు దినం కావడంతో వాయిదా వేశామన్నారు. అంబేడ్కర్‌నగర్, జితేందర్ నగర్‌కు చెందిన అర్హులందరికి ముందుగా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామన్నారు. గత జాబితాలో నలుగురైదుగురు ఉద్యోగులున్నట్లు తేలిందన్నారు. అనర్హులను దొరకబట్టింది తామేనని ఎమ్మెల్యే నాయిని తెలిపారు.

తేలికపాటి నుంచి భారీ వర్షం

హన్మకొండ: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. సోమవారం రాత్రి 7 గంటల వరకు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లో నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం మంగళవారిపేటలో అత్యధికంగా 88.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. హనుమకొండ జిల్లాలో మడికొండ, భీమదేవరపల్లిలో అత్యల్పంగా 3.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

వరంగల్ జిల్లాలో..
నల్లబెల్లి మండలం మేడపల్లిలో 76 మిల్లీ మీటర్లు, నల్లబెల్లిలో 69.3, చెన్నారావు పేటలో 60.3, నర్సంపేట మండలం లక్నేపల్లిలో 48.3, దుగ్గొండిలో 44.8, నెక్కొండలో 44.5, పర్వతగిరి మండలం ఏనుగల్‌లో 37.5, సంగెంలో 34.5, గీసుకొండలో 24.8, వర్ధన్నపేటలో 24, గీసుగొండ మండలం గొర్రెకుంట గ్రామంలో 17.3, రాయపర్తిలో 13.5, సంగెం మండలం కాపుల కనపర్తి గ్రామంలో 12.5, వరంగల్ కాశిబుగ్గలో 8.5, పైడిపల్లి ఏఆర్ఎస్‌లో 8, నెక్కొండ మండలం రెడ్లవాడలో 7.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.



హనుమకొండ జిల్లాలో..
కమలాపూర్ మండలం మరిపల్లి గూడెంలో 33 మిల్లీ మీటర్లు, హసన్‌పర్తి మండలం నాగారంలో 25, ఆత్మకూరులో 24.3, శాయంపేటలో 20, దామెర మండలం పులుకుర్తిలో 19.3, నడికూడలో 17.5, దామెరంలో 17.5, కమలాపూర్‌లో 17, పరకాలలో 16.5, వేలేరులో 12.5, హసన్‌పర్తి చింతగట్టులో 8.5, కాజీపేటలో 8.5, ఎల్కతుర్తిలో 4.8, ఐనవోలు మండలం కొండపర్తిలో 3.8, ఐనవోలులో 3.8, ధర్మసాగర్‌లో 3.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రభుత్వ కళాశాలల్లో నిఘా

- నిరంతర పర్యవేక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటు
- ఒక్కో జూనియర్ కళాశాలకు 14 నుంచి 16 వరకు కేటాయింపు
- విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, ల్యాబ్ సౌకర్యం, ఫిజిక్స్‌వాలా శిక్షణ



హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, మానిటర్‌పై కనిపిస్తున్న కళాశాలలోని సీసీటీవీ ఫుటేజీలు

విద్యారణ్యపురి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇక నుంచి నిరంతర పర్యవేక్షణ కొనసాగనుంది. అందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాలల్లోని తరగతి గదులు, ల్యాబ్‌లు, స్టాఫ్ గది, ప్రిన్సిపాల్ గది, వరండా, కళాశాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు బిగించారు. ఒక్కో కళాశాలలో 14 నుంచి 16 వరకు, అవసరమైన చోట 20వరకు సీసీ కెమెరాలు అమర్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణ నిరంతరం కొనసాగనుంది.


విద్యాబోధనపై నిరంతర పర్యవేక్షణ
గతంలో కేవలం ఇంటర్మీడియట్ పరీక్షల సమయంలో మాత్రమే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేవారు. ఆ తరువాత వాటిని తీసివేసేవారు. ఈ విద్యా సంవత్సరం 2025 - 2026 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రధానంగా విద్యార్థుల హాజరు, అధ్యాపకుల విద్యాబోధనపై నిరంతర పర్యవేక్షణ కొనసాగనుంది. ప్రతీ తరగతి గదిలో నిఘా ఉంటుంది. అకడమిక్ మానిటరింగ్ కమిటీలు, డీఐఈఓలతో పాటు హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డులో కమాండ్ కంట్రోల్ ద్వారా సంబంధిత ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా..
గతంలో ప్రభుత్వ కళాశాలలకు విద్యార్థులు తమ ఇష్టానుసారంగా వచ్చి వెళ్లిపోయేవారు. దాంతో హాజరు శాతం తక్కువగా ఉండడంతో పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం కూడా తక్కువగా ఉండేది. ఈ క్రమంలో సరైన విద్యాబోధన, పరీక్షల ఫలితాలు మెరుగుపడేలా ఉన్నతాధికారులు ఇంటర్‌లో పలు సంస్కరణలు తీసుకొస్తున్నారు. అందులో భాగంగా తాజాగా సీసీ కెమెరాల ఏర్పాటుతో విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంది. ఇకనుంచి అధ్యాపకులు కూడా సక్రమంగా విద్యాబోధన చేయాల్సి ఉంటుంది. ఒక సబ్జెక్టు అధ్యాపకుడు ఒక రోజు రాకుంటే ఆ పీరియడ్‌లో వేరే అధ్యాపకుడు విద్యాబోధన చేయాల్సిన అవసరం ఉంటుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ కళాశాలల సంఖ్య ఇలా..
హనుమకొండ 9, వరంగల్ 11, మహబూబాబాద్ 10, జనగామ 7, ములుగు 8, జయశంకర్ భూపాలపల్లి 5

ఫిజిక్స్‌వాలా శిక్షణ..
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈనెల 15వ తేదీ నుంచి ఫిజిక్స్‌వాలా ద్వారా సంబంధిత వెబ్‌సైట్ ద్వారా జేఈఈ, ఐఐటీ, ఎప్‌సెట్, నీట్‌లాంటి ఎంట్రన్స్ పరీక్షల కోసం ఇంటర్ విద్యార్థులకు శిక్షణ ప్రక్రియ ప్రారంభమైంది. అందుకోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఫిజిక్స్‌వాలా శిక్షణకు సంబంధించిన టైంటేబుల్‌ను డీఐఈఓల ద్వారా ఆయా జిల్లాల కళాశాలల ప్రిన్సిపాళ్లకు అందించారు. ప్రతిరోజూ ఏదో ఒక సబ్జెక్టుపై శిక్షణ ఇవ్వాలి. ప్రస్తుతం వివిధ కళాశాలల్లో ల్యాప్‌ట్యాప్‌లు, కంప్యూటర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ప్రతీ కళాశాలకు ఇన్‌ప్లాంట్స్ టేబుల్స్ కూడా రానున్నాయి. పెద్ద కంప్యూటర్ మానిటర్‌లో వెబ్‌సైట్ ద్వారా వీడియోలను విద్యార్థులు తిలకించనున్నారు. ఫిజిక్స్‌వాలా శిక్షణను విద్యార్థులు సరిగా వినియోగించుకుంటున్నారా లేదా అనేది హైదరాబాద్ నుంచి సంబంధిత అధికారులు కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షిస్తారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణకు ప్రతీజిల్లాకు ఒకరి చొప్పున ఇన్‌చార్జ్‌లను నియమించారని సమాచారం. అలాగే డీఐఈఓలు కూడా పర్యవేక్షిస్తారు. అందుకు, డీఐఈఓ కార్యాలయాల్లో కూడా సీసీ కెమెరాలకు సంబంధించి డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయబోతున్నారు. ఒకవేళ సీసీ కెమెరాల్లో టెక్నికల్ సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించేలా ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఒక టెక్నీషియన్ చొప్పున నియమించారు.

నిరంతర పర్యవేక్షణతో విద్యాబోధన మెరుగు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల నిఘాతో నిరంతర పర్యవేక్షణతో పారదర్శకత పెరగనుంది. అధ్యాపకుల బోధన, విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ ఉండడంతో విద్యాబోధన మెరుగుపడుతుంది. విద్యార్థుల హాజరు పెరగడంతోపాటు అధ్యాపకులు విద్యాబోధనతో మెరుగైన ఫలితాలు వస్తాయి. ప్రయోగాలు చేయడం, టైంటేబుల్‌ను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. జిల్లాల్లో డీఐఈఓలతో పాటు హైదరాబాద్ నుంచి కూడా నిఘా ఉండి ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పలు సూచనలు, సలహాలు ఇస్తారు.
– శ్రీధర్‌సుమన్, డీఐఈఓ, వరంగల్

ఏఐతో విద్యాబోధన: నిట్ డైరెక్టర్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ అధ్యాపకులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ సూచించారు. టెక్నాలజీ ఎనెబుల్డ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ అనే అంశంపై నిట్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో రెండు రోజులపాటు కొనసాగనున్న వర్క్‌షాప్‌ను నిట్ డైరెక్టర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. తరగతి గదుల్లో పుస్తకాల్లోని పాఠ్యాంశాలనే కాకుండా నిజజీవితంలోని ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ బాంబే ప్రొఫెసర్ కన్నన్ మౌధాల్యా, ఐఐటీ గాంధీనగర్ ప్రొఫెసర్ సమీర్ సహస్ర బుదే, నిట్ టీటీఆర్ చెన్నై ప్రొఫెసర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై ఫిర్యాదు

ఎంజీఎం: కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై మట్టెవాడ పోలీసులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా అధికారులు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. హైదరాబాద్‌లోని వీసీ క్యాంపు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు కృష్ణ, ప్రభాకర్.. హైదరాబాద్‌లోని కాళోజీ హెల్త్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తామని కాంట్రాక్టు సంస్థకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇది సరైన పద్ధతి కాదని, ఏదైనా విషయం ఉంటే తమను సంప్రదించాలని వైద్యాధికారులు హెచ్చరించారు. దాంతో అధికారులపై ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డులు బెదిరింపులకు పాల్పడటంతో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపిని వివరణ కోరగా, రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు అందిందని పేర్కొన్నారు. ఫిర్యాదు స్పష్టంగాలేని కారణంగా, ప్రాథమిక విచారణ అనంతరం చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

శ్రీధరాచార్యులకు భారత్ భూషణ్ అవార్డు



వరంగల్ చౌరస్తా : వరంగల్ ఎల్బీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మాసూమ్ అలీ)లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామన్నపేటకు చెందిన వ్యాఖ్యత, గాయకుడు తయ్యాల శ్రీధరాచార్యులకు జాతీయ స్థాయి భారత్ భూషణ్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా సోమవారం కరీంనగర్ ఫిలిం భవన్‌లో శ్రీ గౌతమేశ్వర సాహితి కళాసేవ సంస్థ, శ్రీ ఆర్యాణి సకల కళా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో కళాకారులు, ఉపాధ్యాయులు, వ్యాఖ్యాతలు ఆయనను శాలువాతో సత్కరించారు. ప్రముఖ కవి పార్ల వేణుగోపాల రావు, స్త్రీ అలంకరణ నిపుణులు కుంచాల లావణ్య, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ గోపాల కృష్ణయ్య, సేంద్రియ వ్యవసాయ పరిశోధన నిపుణులు యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స



కాజీపేట అర్బన్ : హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో 71 ఏళ్ల వృద్ధుడికి బ్రెయిన్, స్పైనల్ కార్డ్ అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ టి.సంజయ్ సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. నగరానికి చెందిన వృద్ధుడు నాగయ్య బీపీ, అస్తమాతో బాధపడుతున్నాడు. అలాగే బ్రెయిన్, స్పైనల్‌కార్డ్ కలిసే ప్రాంతంలో (సెర్వికో మెడ్యూల్లరీ జంక్షన్) కణితి ఏర్పడింది. నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స నిమిత్తం నాగయ్య ప్రయత్నించగా హైదరాబాద్‌కు వెళ్లమని వైద్యులు సూచించారు. కాగా నాగయ్య మెడికవర్ ఆస్పత్రికి రాగా వైద్యపరీక్షలు నిర్వహించి ఈనెల 15వ తేదీన హైస్పీడ్ డ్రిల్ అండ్ ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్‌తో అత్యాధునిక పరికరాలను ఉపయోగించి పూర్తిగా మత్తు ఇవ్వకుండా ఆపరేషన్ సమయంలో చేతులు, కాళ్ల కదలికలను గమనిస్తూ శస్త్రచికిత్సను పూర్తి చేశామని, ఇప్పుడు రోగి పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. నగరంలోనే తొలిసారిగా అరుదైన శస్త్ర చికిత్సను అత్యాధునిక పరికరాలతో మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం సౌజన్యంతో పూర్తి చేసామని తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ సెంటర్ హెడ్ నమ్రత, వైద్యులు ఉన్నేష్, దీపక్‌నాగులు పాల్గొన్నారు.

గుండ్లవాగు ప్రాజెక్టులో మృతదేహం లభ్యం



గోవిందరావుపేట : మండలంలోని గుండ్లవాగు ప్రాజెక్టులో అనుమానాస్పదస్థితితో చనిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యమైందని పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. సోమవారం గుండ్లవాగులో వ్యక్తి మృతదేహం ఉన్న సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. వరంగల్ జిల్లా ఏనుమాముల గ్రామానికి చెందిన ఈసంపల్లి మణికుమార్ (26) ఎలక్ట్రీషియన్ పని చేస్తున్నాడు. గురువారం తన తండ్రితో గొడవపడగా మందలించాడు. అనంతరం స్నేహితుడి ఇంట్లో ఫంక్షన్ ఉందని చెప్పి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. శనివారం తన చెల్లెలు రాణికి ఫోన్ చేసి నాకు బతకాలని లేదని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని తెలిపారు. గుండ్లవాగులో లభ్యమైన మృతదేహం విషయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా తమ కుమారుడు మణికుమార్‌గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

తెలంగాణ ఉద్యమ దివిటీ.. దాశరథి

నిజాంను ధిక్కరించిన ధీశాలి

నేడు దాశరథి కృష్ణమాచార్యుల జయంతి



చిన్నగూడూరు : నిజాం నిరంకుశ పాలనకు చరమ గీతం పాడి..తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'తో తుడిచి నైజాం రాజులను ఎదిరించిన తెలంగాణ ఉద్యమ దివిటీ దాశరథి కృష్ణమాచార్యులు. నిజాంల పాలన, పెత్తందార్ల పోకడలపై తన అక్షరాన్ని అగ్నిధారగా, పద్యమే పదునైన ఆయుధంగా మలిచి రుద్రవీణలు మోగించి తెలంగాణ ప్రజలను మేల్కొలిపిన రథసారథి దాశరథి. నేడు ఆయన జయంతిని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో వెంకటాచార్యులు-వెంకటమ్మ దంపతులకు 1925, జూలై 22న దాశరథి కృష్ణమాచార్యులు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం చిన్నగూడూరులో ప్రారంభమై ఖమ్మం జిల్లా మధిరలో కొనసాగింది. ఆయన విద్యాభ్యాసం మొత్తం ఉర్దూ భాషలో కొనసాగింది. కాగా అప్పటి పరిస్థితుల దృష్ట్యా వారి కుటుంబం గార్లకు వెళ్లింది. అక్కడే ఉన్నత విద్యను పూర్తి చేశారు. పెత్తందార్ల ఆగడాలను అరికట్టేందుకు రచనలపై మక్కువ పెంచుకుని తన కవితల ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్యం చేశారు. నిజాం రాజులను ఎదిరించి జైలు జీవితం అనుభవించారు. దాశరథిని జైలులో బంధిస్తే జైలు గోడలపై నిజాంకు వ్యతిరేకంగా 'ఓ నిజాం పిశాచమా.. కానరాడు, నిన్నుబోలిన రాజు మాకెన్నడని', 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని కవితలు రాసి ప్రపంచానికే వెలుగెత్తి చాటిన మహనీయుడు దాశరథి. నిజాం పాలకుల చేతిలో



మండల కేంద్రంలోని దాశరథి విగ్రహం

దోపిడీకి గురై సమస్యలతో సతమవుతున్న తెలంగాణ ప్రాంత ప్రజల్లో తన రచనలతో మార్పు తెచ్చిన చైతన్య శీలి దాశరథి. పోలీసు చర్య అనంతరం జైలు నుంచి దాశరథి విడుదలయ్యారు. చివరికి 1987, నవంబర్ 5న ఆయన తుదిశ్వాస విడిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో తన రచనలు ప్రతి గొంతుకను పిడికిలెత్తి నినదించేలా చేశాయి. ఆయన రచించిన పాటలు, రచనలు, ప్రేరణ యావత్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని దాశరథి కృష్ణమాచార్యులు విగ్రహం వద్ద నేడు దాశరథి జయంతి వేడుకలను జరుపుకోనున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

గేయాలు, రచనలు..

సినీ గేయ రచయితగా 124 చిత్రాలకు వందల గీతాలు, కవితలు, ఎన్నో రచనలు చేశారు. ఆయన రాసిన సినిమా పాటలు 'కన్నయ్యా నల్లని కన్నయ్యా', 'ఖుషి ఖుషీగా నవ్వుతూ', 'ఆవేశం రావాలి ఆవేదన కావాలి', 'ననుపాలింపగ నడచి'.. ఇలా ప్రతీపాట ఓ పూలచెండు పరిమళం. ఆయన రాసిన ప్రముఖ గేయం 'ఆ చల్లని సముద్ర గర్భం' అనే గీతంలో ఆయన లేవనెత్తిన ప్రశ్నలు దశాబ్దాలు గడిచినా.. ప్రశ్నలుగానే మిగిలిపోవటం పాలకుల చేతకానితనమేమో.. అంతటి ఆయన కవిత్వం అజరామరం. అగ్నిధారలతో కురిపించిన ఆయన కవిత్వాలు ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకం అయ్యాయి.

రాజకీయ పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

- 30, 31 తేదీల్లో బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో ప్రశిక్షణ్ తరగతులు
- బీజేపీ రాష్ట్ర ప్రశిక్షణ్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి

మామునూరు : రాజకీయ చైతన్య పోరాటాలకు భారతీయ జనతా పార్టీ జిల్లా, మండల అధ్యక్షులు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర ప్రశిక్షణ్ కమిటీ కన్వీనర్ ఓ.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బీజేపీ ఉమ్మడి వరంగల్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 30, 31వ తేదీల్లో జరిగే జిల్లా, మండల అధ్యక్షుల ప్రశిక్షణ్ తరగతుల శిబిరం ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రశిక్షణ్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ ఎస్.గౌతమ్ రావు,



మాట్లాడుతున్న కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి

బి.శేఖర్, క్రాంతి కిరణ్ హాజరయ్యారు. జిల్లా, రాష్ట్ర నాయకులతో కలిసి సాధికారత, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన ప్రణాళికలపై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి ప్రజలకు చేరే వేసే విధంగా కృషి చేయాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం సాధించే దిశగా బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

అదనపు కట్నంకోసం వేధిస్తున్నారు

- కాపురానికి తీసుకెళ్లడం లేదని భార్య పోరాటం
- మూడ్రోజులుగా భర్త ఇంటి ఎదుట నిరసన దీక్ష

జఫర్‌గఢ్ : అదనపు కట్నం కోసం మూడేళ్ల నుంచి భర్త తనను కాపురానికి తీసుకు పోవడం లేదని బాధిత మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి భర్త ఇంటి ఎదుట నిరసన దీక్ష చేపట్టిన సంఘటన మండలంలోని షాపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత మహిళ, కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుర్చపల్లికి చెందిన గుర్రం శ్రావణిని జఫర్‌గఢ్ మండలం షాపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీకాంత్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఒప్పుకున్న మేరకు రూ.15లక్షల కట్నం పోను అదనంగా మరో రూ.15 లక్షలు కలిపి మొత్తంగా రూ.30లక్షలు ముట్టజెప్పారు. పెళ్లి తర్వాత రెండు నెలల పాటు శ్రీకాంత్-శ్రావణిల సంసారం సాఫీగా సాగింది. అనంతరం అదనపు కట్నం కోసం భర్త శ్రీకాంత్‌తో పాటు అత్త లక్ష్మి, మామ వెంకటేష్.. శ్రావణిని వేధింపులకు గురి చేశారు. వారి వేధింపులు తట్టుకోలేక శ్రావణి పుట్టింటికి వచ్చేసింది. అప్పటి నుంచి భర్త శ్రీకాంత్ తన భార్యను కాపురానికి తీసుకపోవడం లేదు. ఈ విషయంపై బాధిత మహిళ హైదరాబాద్‌లోని ఉప్పల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శ్రీకాంత్‌కు కౌన్సిలింగ్ ఇచ్చి శ్రావణిని కాపురానికి పంపారు. అయినా కూడా శ్రీకాంత్‌లో మార్పు రాకపోవడంతో మళ్లీ భార్యను వేధింపులకు గురి చేశాడు. హైదరాబాద్‌లో ప్లాట్ కొనిస్తేనే భార్యను కాపురానికి తీసుక పోతానంటూ లేనిచో తన ఇంటికి రావొద్దంటూ అతడితో పాటు తల్లిదండ్రులు కూడా ఆమెను వేధించారు. దీంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఇటీవల రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయినా భార్యను తీసుకపోయేందుకు భర్త శ్రీకాంత్‌తో పాటు అత్తమామలు రాకపోవడంతో బాధితురాలు తన కుటుంబ సభ్యులతో కలసి భర్త ఇంటికి వచ్చింది. ఇది గమనించిన అత్త, మామ ఇంటికి తాళం వేసి పరారయ్యారు. దీంతో శ్రావణి కుటుంబ సభ్యులతో కలిసి మూడ్రోజుల నుంచి భర్త ఇంటి ఎదుట వంటావార్పు చేస్తూ అక్కడనే నిరసన దీక్ష చేస్తోంది. ఆమెకు గ్రామస్తులు కూడా అండగా నిలిచారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు బాధిత మహిళ కుటుంబ సభ్యులతో పాటు భర్త, అతడి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు.



భర్త ఇంటి ఎదుట దీక్ష చేస్తున్న శ్రావణి

వ్యవసాయ భూమికి బాట కోసం రైతు వినూత్న నిరసన

- పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో అర్ధనగ్న స్నానం

పాలకుర్తి టౌన్ : తన వ్యవసాయ భూమికి దారి లేకుండా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ రైతు రోడ్డుపై అర్ధనగ్న స్నానం చేసి వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. ఈ ఘటన సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన రైతు భూమండ్ల పెద్దపురానికి గ్రామంలోని కోమటికుంట, బ్రాహ్మణకుంట పక్కన సొంత వ్యవసాయ భూమి ఉంది. ఈ కుంటల దారినుంచే ఆ భూమికి వెళ్లాల్సి ఉంటుంది. ఇటీవల కొందరు రైతులు ఆ కుంటలను కబ్జా చేశారు. దీంతో తన వ్యవసాయ భూమికి వెళ్లేందుకు బాట లేకుండా పోయింది. ఆందోళన చెందిన రైతు పెద్దపురం గతంలో కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో అర్ధనగ్నంతో స్నానం చేసి నిరసన తెలిపాడు. తన వ్యవసాయ భూమి వద్దకు బాట ఏర్పాటు చేయాలని అధికారులను కోరాడు. అనుమతి లేకుండా నిరసన తెలపవద్దని చెప్పి అతడిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.



రాజీవ్ చౌరస్తాలో రోడ్డుపై అర్ధనగ్న స్నానం చేసి నిరసన తెలుపుతున్న రైతు పెద్దపురం

మీ అన్న ఎక్కడ? అంటూ.. తమ్ముడిపై దాడి

- పోలీసులకు ఫిర్యాదు

గూడూరు: అన్నపై కోపంతో ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు తమ్ముడిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని కొల్లాపురం శివారు ఇప్పల్‌తండా చెరువు కట్టపై సోమవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పల్‌తండాకు చెందిన ధరావత్ హక్యా, కాంతిలకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శివాజీ కలకత్తాలోని ఖరగ్‌పూర్‌లో ఐఐటీ చదువుతున్నాడు. రెండో కుమారుడు సాయి మానుకోటలోని నలంద కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మధ్యాహ్నం తండా సమీప చెరువు కట్టపై నుంచి వస్తుండగా ఎదురుగా వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు సాయిని అడ్డగించారు. ఫొటో చూపి ఈ వ్యక్తి తెలుసా అని అడిగారు. అది చూసిన సాయి, ఆ ఫొటో తన అన్నదే అని సమాధానం ఇచ్చాడు. వెంటనే కోపోద్రిక్తులైన ఆ ముగ్గురు కొన్ని రోజులుగా తిరుగుతున్నాము, మీ అన్న కనిపించడంలేదు, ఎక్కడికెళ్లాడంటూ.. బ్లేడ్, కత్తితో దాడికి పాల్పడ్డారు.సెల్‌ఫోన్ కూడా ధ్వంసం చేశారు. బ్లేడ్ గాయంతో రక్తం కారుతుండగా, మరో వ్యక్తి కత్తితో దాడికి యత్నించాడు. చేయి అడ్డం పెట్టి చాకచక్యంగా వారి నుంచి తప్పించుకొని అరుస్తూ కొద్ది దూరం పరుగెత్తి పడిపోయాడు. తండా సమీపం ఈ సంఘటన జరగడంతో వారు సాయిని వదిలేసి పారిపోయారు. కొద్దిసేపటికి లేచిన అతను తండాలోకి వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. వెంటనే తండావాసులు గాలించినా ఎవరూ కనిపించలేదు. అనంతరం గూడూరుకు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులను అడగ్గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



బ్లేడ్ గాట్లతో సాయి

ఉజ్వల భవితకు 'నవోదయం'

2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలు

- ఉమ్మడి జిల్లాలో 80 సీట్లు, రిజర్వేషన్లు వర్తింపు
- 29 వరకు దరఖాస్తుకు గడువు

ఖిలా వరంగల్ : వరంగల్ మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-2027 విద్యా సంవత్సరంలో ఆరోతరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హత గల ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈవిద్యాలయంలో సీటు లభిస్తే విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన బోధన అందుతుంది. చక్కని ప్రణాళికతో చదివి పరీక్షను రాస్తే నవోదయలో ప్రవేశం సులభమని ప్రిన్సిపాల్ పూర్ణిమ తెలిపారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రాధాన్యం..

మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 80 సీట్లు ఉంటాయి. వీటిలో 75 శాతం గ్రామీణ, 25 శాతం నగర, పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్ అమలు చేస్తారు. మొత్తం సీట్లలో బాలికలకు 1/3 వంతు సీట్లు కేటాయిస్తారు. పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు ఉంటాయి. అర్హత గల విద్యార్థులు ఈనెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని నవోదయ అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పని సరి..

దరఖాస్తు సమయంలో చాలా మంది విద్యార్థులు తప్పులు చేస్తుంటారు. విద్యార్థి గ్రామం ఏ నవోదయ విద్యాలయ పరిధి, బ్లాక్ పరిధిలోకి వస్తుంది అన్న అంశాలను వెబ్ సైట్‌లో పొందుపరిచిన వివరాలు పరిశీలించుకోవాలి. అది తెలియకుండా నచ్చిన బ్లాకును ఎంచుకుంటే సీటు కోల్పోవాల్సి వస్తుంది. కొంత మంది విద్యార్థులు గ్రామీణ, నగర, పట్టణాన్ని ఎంపిక చేసుకునే విషయంలో తప్పులు చేస్తుంటారు. నగరం, పట్టణం అయితే నగరం, పట్టణం అని, గ్రామం అయితే గ్రామం అని ఎంచుకోవాలి. లేని పక్షంలో సీటును కోల్పోయే ప్రమాదం ఉంటుంది.



మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయం

డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష..

ఈ ఏడాది డిసెంబర్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అబ్జెక్టివ్ విధానంలో రెండు గంటల పాటు పరీక్ష ఉంటుంది. ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు చదివి ఉండాలి. ఐదో తరగతి తప్పని సరిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చదివిన వారు అర్హులు. విద్యార్థులు 2014, మే 1 నుంచి 2016, జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. పరీక్ష మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, లాంగ్వేజ్ విభాగాల నుంచి 100 మార్కులకు గాను 80 అబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు.. వీటికి 50 మార్కులు ఉంటాయి. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్‌లలో ఒక్కో దానికి 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో విభాగానికి 25 మార్కుల చొప్పున 50 మార్కులు కేటాయించారు. మెంటల్ ఎబిలిటీ టెస్టుకు గంట, అర్థమెటిక్ అరగంట, లాంగ్వేజ్ టెస్టుకు అరగంట చొప్పున సమయం కేటాయించనున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

2026-27 విద్యా సంవత్సరానికి గాను నవోదయలో 80 సీట్లలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. ఈనెల 29వ తేదీతో గడువు ముగియనుంది. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులకు ఉజ్వల భవితను అందించే చక్కని వేదిక జవహర్ నవోదయ విద్యాలయం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నాం. - పూర్ణిమ, నవోదయ ప్రిన్సిపాల్, మామునూరు

ఆర్థిక ఇబ్బంది ఉన్నా.. అభివృద్ధే లక్ష్యం



బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- చెల్పూరులో బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన

గణపురం : కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూనే మరో వైపు అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం గణపురం మండలం చెల్పూరు గ్రామంలో కేటీపీపీ సీఎస్ఆర్ రూ.5.50 కోట్ల నిధులతో బస్టాండ్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రజా ప్రభుత్వం కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతోనే పని చేస్తోందన్నారు. భూపాలపల్లి నియోజక వర్గంలో మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. మరో 1,500 ఇళ్లు ఇస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో వరదలు సంభవించి భారీ నష్టం జరిగితే అది పూడ్చడానికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్ని శాఖల మంత్రుల వద్దకు తిరిగి నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నాడన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి నడిపిస్తున్నామని వివరించారు. గణపురంలోని గాంధీనగర్ వద్ద 60 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్నామని, అందులో మహిళలకు మిని ఇండస్ట్రీస్ ఏర్పాటుకు 20 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరిగారని, అన్ని అర్హతలు ఉన్న నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. నియోజకవర్గంలో 15 వేల రేషన్ కార్డుల్లో మార్పులు చేశామని నూతనంగా 5 వేల రేషన్ కార్డులు అందించినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. కొత్తపల్లిగోరి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తామని అన్నారు. జిల్లాకు మైనింగ్ కళాశాలతో పాటు పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయాలని, అలాగే డీబీఎం 38 కాల్వకు రూ.320 కోట్లు మంజూరు చేయాలని మంత్రులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మితో పాటు అధికారులు పాల్గొన్నారు.

భర్త వద్దు.. ప్రియుడే కావాలి

- వివాహిత ఇష్టం మేరకు ప్రియుడితో పంపిన కులపెద్దలు
- తన భార్యను అప్పగించాలని భర్త శంకర్ వేడుకోలు

వేలేరు : నలుగురు పిల్లల తల్లి (ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు).. తనకు భర్త వద్దు.. ప్రియుడే కావాలని పంచాయితీ పెద్దలకు చెప్పడంతో వారు ఆమె ఇష్టం ప్రకారం ప్రియుడుతోనే పంపించిన ఘటన మండలంలోని షోడాషపల్లి శివారు పిట్టల గూడెంలో ఇటీవల జరిగింది. భర్త కాలియ శంకర్ తెలిపిన కథనం ప్రకారం.. తనకు చంద్రమ్మతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. మాకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏడాది క్రితం లోక్యాతండా గ్రామ పంచాయతీ శివారు వేపలగడ్డ తండాకు చెందిన అజ్మీరా రాజుతో చంద్రమ్మకు వివాహేతర సంబంధం ఏర్పడింది. మూడు నెలల క్రితం చంద్రమ్మ, రాజు కలిసి పారిపోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇద్దరిని పట్టుకొచ్చారు. అనంతరం ఇరు కుటుంబాలు పెద్దలు పంచాయితీలో మాట్లాడుకుంటామని పోలీసులకు చెప్పారు. దీంతో కులపెద్దలు చంద్రమ్మను తన తల్లిగారి గ్రామమైన చిల్పూరు మండలం వెంకటాద్రిపేటకు పంపించారు. అయితే మళ్లీ చంద్రమ్మకు రాజు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకువెళ్లాడు. వారంక్రితం రాజు, చంద్రమ్మ వేపలగడ్డ తండాకు వచ్చారనే విషయం తెలుసుకున్న భర్త శంకర్ కుటుంబ సభ్యులు తండాకు వెళ్లి రాజును, చంద్రమ్మను చితకబాదారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గొడవ జరుగకుండా నిలువరించారు. ఇరువురికి తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం చంద్రమ్మ రాజుతోనే ఉంటానని కుటుంబ సభ్యులకు తెగేసి చెప్పి అతడితోనే వెళ్లిపోయింది. తనకు తన భార్య కావాలని, తల్లి కోసం పిల్లలు ఏడుస్తున్నారని భార్యను తనకు అప్పగించాలని భర్త శంకర్ పోలీసులను వేడుకున్నాడు.



కుటుంబ సభ్యులతో కాలియ శంకర్

శ్రావణమాస ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

హన్మకొండ కల్చరల్ : ఈ నెల 25వ తేదీ నుంచి ఆగస్టు 23 వరకు వేయిస్తంభాల దేవాలయంలో జరగనున్న శ్రావణ మాసోత్సవాల కరపత్రం, వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమా దంపతులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి దేవాలయంలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. స్వామివారికి రుద్రాభిషేకాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అనిల్‌కుమార్, ఆలయ వేదపండితులు గంగు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ ఆలయ సిబ్బంది మధుకర్, రజిత, కార్పొరేటర్ జక్కుల రవీంద్రయాదవ్, కాంగ్రెస్ నాయకులు కుమార్‌యాదవ్, రాహుల్‌రెడ్డి, ఠాకూర్, తోట పవన్, సాంబరాజు వికాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నాయిని తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో వేయిస్తంభాల ఆలయంలో, భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



శ్రావణ మాసోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని దంపతులు, చిత్రంలో గంగు ఉపేంద్రశర్మ, తదితరులు